ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 13 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm


అల్లు ఇంటికి చేరుకున్న పోలీసులు


భార్యకు ధైర్యం చెబుతున్న అర్జున్

# అల్లు అర్జున్ అరెస్టు



**105 సెక్షన్ కింద నాన్ బెయిలబుల్ కేసు**

**నాలుగు సెక్షన్ కింద కేసు నమోదు**

**సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో ..**

**అల్లు అర్జున్ స్టేట్మెంట్ ను రికార్డ్ చేసిన పోలీసులు**

హైదరాబాద్ : సినీ నటుడు అల్లు అర్జున్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'పుష్ప-2' సినిమా బెనిఫిట్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్ కు బన్నీ వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా అక్కడ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అల్లు అర్జున్ పై కేసు నమోదయింది. ఈ క్రమంలోనే చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్ ను అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 20 మంది పోలీసులు అల్లు అర్జున్ నివాసానికి వెళ్లారు.

హైదరాబాద్ లోని నివాసం నుంచి ఆయనను పోలీసులు తమ వాహనంలో పీఎస్ కు తీసుకెళ్లారు. నవ్వుతూ అల్లు అర్జున్ పోలీసుల వాహనంలోకి ఎక్కారు. ఈ కేసులో అల్లు అర్జున్ ఏ2గా ఉన్నారు. బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 105 ప్రకారం హత్య లేదా ప్రాణనష్టం కేసు, 118(1) వంటి నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఎఫ్ఐఆర్ లో నమోదు చేసిన సెక్షన్ల ప్రకారం స్టేషన్ బెయిల్ మంజూరు చేసే అవకాశం లేదు. ఈ సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉంది.

మరోవైపు, కేసును కొట్టివేయాలని కోరుతూ అల్లు అర్జున్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే హైకోర్టులో బన్నీకి ఇంకా ఊరట లభించలేదు. న్యాయస్థానం ఇంకా తీర్పును వెలువరించలేదు. ఇదే ఘటనలో సంధ్య థియేటర్ పై కూడా కేసు నమోదు చేశారు. బన్నీని పోలీసులు కోర్టు ముందు హాజరుపరిచే అవకాశం ఉంది. బన్నీ అరెస్ట్ వ్యవహారం సంచలనంగా మారింది.

గాంధీ ఆసుపత్రికి అల్లు అర్జున్ తరలింపు

బన్నీని ఆయన నివాసం నుంచి చిక్కడపల్లి పీఎస్ కు తరలించారు. పీఎస్ లో అల్లు అర్జున్ స్టేట్మెంట్ ను పోలీసులు రికార్డు చేశారు. ప్రస్తుతం రిమాండ్ రిపోర్టును పోలీసులు తయారు చేస్తున్నారు. మరోవైపు వైద్య పరీక్షల కోసం బన్నీని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆయనను కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఆయన తరపున న్యాయవాదులు బెయిల్ పిటిషన్ వేసే అవకాశం ఉంది. ఇంకోవైపు, చిక్కడపల్లి పీఎస్ కు అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్, సోదరుడు శిరీష్ చేరుకున్నారు.

## పోలీసుల తీరుపై అల్లు అర్జున్ అసహనం

ఉన్నపళంగా తమతో రావాలంటే ఎలా అని అల్లు అర్జున్ అన్నారు. పోలీసులు తీసుకెళ్లడంలో నాకు అభ్యంతరం లేదన్నారు. బట్టలు మార్చుకునేందుకు కూడా అవకాశం ఇవ్వరా అని అన్నారు. ఆయనతోపాటు అల్లు అరవింద్ కు అనుమతి ఇచ్చారు. అనంతరం చిక్కడపల్లి స్టేషన్ కు తరలించారు.

## క్వాష్ పిటిషన్ పై విచారణ.. సోమవారం వరకు అరెస్టు చేయొద్దంటూ..

కాసేపట్లో అల్లు అర్జున్ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరగనుంది. సోమవారం వరకు అరెస్ట్ చేయకుండా ఆర్డర్ ఇవ్వాలని లంచ్ మోషన్ పిటిషన్‌ను అల్లు అర్జున్ వేశారు. పిటిషన్‌పై మధ్యాహ్నం 2.30కి హైకోర్టు విచారిస్తామని తెలిపింది.

## అత్యవసర పిటిషన్.. సోమవారం విచారిస్తామన్న హైకోర్టు

సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో నిందితుడిగా ఉన్న సినీ నటుడు అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని కోరుతూ బన్ని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఆయన్ను అదుపులోకి తీసుకున్న కొద్దిసేపటికే అల్లు అర్జున్ తరపు న్యాయవాది దీనిని అత్యవసర పిటిషన్‌గా విచారించాలని న్యాయస్థానాన్ని కోరారు. 'అత్యవసర పిటిషన్‌ను ఉదయం 10.30 గంటలకే మెన్షన్ చేయాలి కదా' అని ఈ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. బుధవారం రోజు పిటిషన్ ఫైల్ చేశామని, క్వాష్ పిటిషన్‌ను వేసినట్లు పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లామని అల్లు అర్జున్ తరపు న్యాయవాది నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఈ పిటిషన్‌ను సోమవారం విచారిస్తామని చెప్పింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా లంచ్ మోషన్ పిటిషన్‌గా స్వీకరించాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. బుధవారం పిటిషన్ దాఖలు చేసి, నెంబర్ అయినా.. కోర్టు సిబ్బంది బిజీగా ఉండడం వల్ల లిస్టులోకి రాకపోయి ఉండొచ్చని వివరించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు లంచ్ మోషన్ పిటిషన్ విచారించాలనడం సరైనది కాదని ఈ సందర్భంగా ప్రభుత్వ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. సోమవారం వరకూ ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని అల్లు అర్జున్ తరపు న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టును కోరారు. అయితే, పోలీసుల నుంచి వివరాలు సేకరించిన తర్వాతే కోర్టుకు సమాచారం ఇస్తానని ప్రభుత్వ న్యాయవాది.. న్యాయస్థానానికి తెలిపారు.

## చిరంజీవి చిక్కడపల్లి పీఎస్ కు...

చిక్కడపల్లి పీఎస్ కు చిరంజీవి బయల్దేరారు. విశ్వంభర షూటింగ్ క్యాన్సిల్ చేసుకున్నట్లు తెలిసింది.

## ఇది జరిగింది...

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో ఈ నెల 4న రాత్రి 'పుష్ప-2: ది రూల్' ప్రీమియర్ షో కోసం అల్లు అర్జున్ రాకతో జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందారు. ఆమె కుమారుడు శ్రీతేజ్ (9)కు గాయాలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం శ్రీతేజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో పోలీసులు ఇప్పటికే సెక్యూరిటీ గార్డ్ సహా థియేటర్ యజమాన్యానికి చెందిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.